ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 24.0

పాత జీఎస్టీతో ఔషధాల విక్రయం

» మూడు దుకాణాలపై కేసులు నమోదు

■ లోపలి పేజీలో..

లైన్ క్లియర్!



తమ్మిలేరు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు పడుతూ లేస్తూ ముందుకు సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం కారణంగా పనుల్లో తీవ్ర జాప్యానికి దారి తీయగా, టీడీపీ ప్రభుత్వం వచ్చాక పనుల్లో కదలిక వచ్చేసరికి ప్రాజెక్టుకు నిధులు విడుదల ఆగిపోయింది. మళ్లీ నిధుల వేటలో ప్రభుత్వం ముందడుగు వేయడంతో జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ) సంస్థ రెండేళ్ల కాలపరిమితితో నిధులిచ్చి పూర్తి చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. త్వరలో పనులు గాడిన పడతాయని అధికారులు పేర్కొంటున్నారు.

\- ఏలూరు- ఆంధ్రజ్యోతి

తమ్మిలేరు ఆధునికీకరణకు జైకా నిధులు

రెండేళ్ల కాలపరిమితితో నిధుల విడుదలకు అంగీకారం



తమ్మిలేరు ప్రాజెక్టు కుడికాల్వపై నిర్మించిన స్లూయిజ్ (ఫైల్)

తమ్మిలేరు రిజర్వాయర్ పరిధిలో రెండు పంటలకు పుష్కలంగా సాగు నీరందించేందుకు ప్రాజెక్టు పరిధిలో కీలకమైన పనులు పూర్తి చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మూడేళ్ల పాటు ప్రాజెక్టును అటకెక్కించడంతో పనులు నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక మళ్లీ పనుల్లో కదలిక మొదలైంది. కొంత మేర బిల్లుల విడుదల కాక మళ్లీ కొంత స్తబ్ధత రాజ్యమేలింది. అయితే ఆయకట్టు స్థిరీకరణ చేపడుతున్న మరమ్మతు పనులకు తాజాగా జైకా సంస్థ నుంచి నిధుల మంజూరును జపాన్ ప్రభుత్వం రెండేళ్ల కాలపరిమితికి పెంచుతూ ప్రభుత్వంతో ఇటీవల ఎంవోయూ కుదుర్చుకోవడంతో ఈ పనులు వేగం అందుకోనున్నాయి.

2018లోనే ప్రారంభం...

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టును జైకా రుణం కింద రూ.16 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2019లో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ల పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ప్రాజెక్టు పరిధిలో పనులు నిలిచాయి. తర్వాత వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ప్రక్రియతో పనులను అటకెక్కించేసింది. 2021లో రివర్స్ టెండరింగ్ కింద పనులు ప్రారంభించగా గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ కేవలం 1.64 కోట్ల పనులే పూర్తి చేశారు. ఆపై బిల్లుల రాక పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక బిల్లుల చెల్లింపు చేసింది. గతేడాది నవంబరులో జలాశయం కట్టపై (మిగతా 8వ పేజీలో)

ఏటిగట్ల పటిష్టత కీలకమే

తమ్మిలేరు ఎడమ, కుడి, మధ్య కాల్వలకు రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల వలనే రెండు పంటలు సాగులోకి వస్తాయి. ఎడమ, మధ్య కాల్వల కింద చాట్రాయి మండలంకు 4200 ఎకరాలు సాగునీరు అందాల్సి ఉంది. కుడి కాల్వ కింద లింగపాలెం, చింతలపూడి పరిధిలో 5వేల ఎకరాలు ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరందేది. రిజర్వాయర్ పరిధిలో స్టోరేజ్ ప్రాంతంలోనే మట్టితో కట్టిన కట్టకు రివిట్‌మెంట్ 7 కిలోమీటర్లు మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. చాట్రాయి, లింగపాలెం, ముసునూరు పెదవేగి మండలాల్లో ఏటిగట్లు పటిష్టవంతం చేయాల్సి ఉంది.

జూన్‌కు పూర్తి చేయడానికి చర్యలు



తమ్మిలేరు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం. ఈ డిసెంబరు నాటికి కుడి, ఎడమ కాల్వల పరిధిలో షట్టర్లు, కల్వర్టులు, తూములు ఏర్పాట్లు పనులు కార్యాచరణ సిద్ధం చేశాం. కాంట్రాక్టర్‌కు రూ.6కోట్ల పైబడి బిల్లులు చెల్లింపు చేయాలి. త్వరితగతిన బకాయిలు చెల్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జైకా సంస్థ రెండేళ్ల కాలంలో పనులు చేపట్టేందుకు నిధులు విడుదలకు అంగీకారం తెలిపింది.

\- సీహెచ్ దేవప్రకాశ్, జల వనరులశాఖ ఎస్ఈ



చింతకొయ్య మెట్ట వద్ద కోతకు గురైన రోడ్డు మార్జిన్

ప్రమాదం అంచున!

» కోతకు గురైన చాట్రాయి-నరసాపురం రోడ్డు

» ప్రమాదకరంగా మారిన మార్జిన్లు

చాట్రాయి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్అండ్‌బీ రహదారి (వివి రోడ్డు)పరిధిలో చాట్రాయి-నరసాపురం గ్రామాల మధ్య సింగిల్ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు కోతకు గురికావడంతో ఈ రోడ్డుపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని భారీ వర్షాల వల్ల ఒక్కో చోట రెండు నుంచి మూడు అడుగులు లోతున రోడ్డు మార్జిన్లు కోతకు గురయ్యాయి. ద్విచక్రవాహనాలు, చిన్నకార్లు నడిపేవారు ఈ రోడ్డులో ప్రాణాలు అరచేత పట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఏలూరు-ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు జంగారెడ్డిగూడెం ప్రాతంలో నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఈ రోడ్డు మీదుగా 50, 60 టన్నుల భారీ వాహనాలలో మెటల్ తరలిస్తున్నారు. మార్జిన్లు కోతకు గురైన సింగిల్ రోడ్డులో భారీ వాహనాలు ఒకదాని వెనుక ఒకటి అతివేగంగా వస్తుండటంతో తప్పుకోవడం కష్టతరంగా మారింది. ఎదురుగా వేగంగా వస్తున్న వాహనాన్ని తప్పించుకోవడానికి రోడ్డు దిగితే మార్జిన్లలో పడి ప్రమాదాల పాలవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చాట్రాయి-నరసాపురం మధ్య రహదారి మార్జిన్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



పామాయిల్ నర్సరీ దగ్గర కోతకు గురైన రోడ్డు మార్జిన్

డీఎస్డీవోగా ఎస్‌ఏ అజీజ్



ఏలూరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా విజయవాడ డీఎస్డీవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఏ అజీజ్‌ను నియమిస్తూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ డీఎస్డీవోగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసరావును సంస్థ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అజీజ్ గతంలో జిల్లాలో క్రీడల చీఫ్ కోచ్‌గా పని చేశారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది.



బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడో రోజు వైభవంగా జరిగాయి. పంచామృత, మండపారాధన, మహాస్నపనము, మహాసుదర్శన హోమం, తోమాల సేవ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారు కోదండరామ అలంకరణలో హనుమద్ వాహనంపై తిరువీధులలో విహరించగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



మండవల్లిలో జలమయమైన రహదారి

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ/మండవల్లి/చింతలపూడి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. గత 24 గంటల్లో అత్యధికంగా భీమడోలు మండలంలో 33 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 4 మి.మీగా నమోదైంది. లింగపాలెం 32.2, బుట్టాయిగూడెం 30.2, పోలవరం 3.6, ముసునూరు 2.4, ముదినేపల్లి 2.2, కొయ్యలగూడెం 2.2, నూజివీడు 1.8, ఉంగుటూరు 1.4, కామవరపుకోట 1.2, చింతలపూడి 1, నిడమర్రు 0.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. మండవల్లి మండలంలో అల్పపీడన ద్రోణీ వల్ల ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటన్నర సేపు ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

రైతుల్లో ముసురు భయం

మెట్ట రైతుల్లో ముసురు భయం వెంటాడుతోంది. గత నాలుగైదు రోజులుగా సాయంత్రం వేళ ముసురు ఏర్పడడం, ఉరుముల ధ్వనులతో ఏ క్షణంలో వర్షం పడుతుందనే భయం రైతుల్లో నెలకొంది. ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో వరి సాగు ప్రారంభంలో వర్షలేమితో ఆందోళన పడ్డారు. ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షంతో సాగు పూర్తి చేసి గట్టెక్కారు. ఇప్పుడు పంట పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో వర్షం పడి గాలి వస్తే తాలు శాతం పెరుగుతుందని రైతులు ఆందోళన పడుతున్నారు. మండలంలో సుమారు 12 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది.



ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):చినవెంకన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ఆలయానికి భక్తుల రాకతో అన్ని విభాగాలు సందడిగా మారాయి. వేలాది మంది స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారుల అంచనా. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

సూపర్ జీఎస్టీపై నేడు అవగాహన ర్యాలీ

ఏలూరు,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం స్థానిక శాంతినగర్ పోలీస్‌పెట్రోలు బంకు నుంచి పాతబస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.

నేడు పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

ఏలూరు,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌తో పాటు, మండల, డివిజన్, మున్సిపల్ కేంద్రాల్లో ప్రజా పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కింద వినతుల స్వీకరణ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్టు ఆదివారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులను పంపవచ్చన్నారు.



ఆటపాకలో చేపల చెరువును పరిశీలిస్తున్న మత్స్య కళాశాల విద్యార్థులు

కొల్లేరులో చేపల పెంపకంపై మత్స్య కళాశాల విద్యార్థుల అధ్యయనం

కైకలూరు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో క్షేత్రస్థాయిలో పర్యటించడం వల్ల చేపల సాగు చేసే విధానాలను తెలుసుకోవడం తమ విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని మత్స్యకళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. కైకలూరు మండలంలోని కొల్లేరు ప్రాంతంలో ఆదివారం నెల్లూరు జిల్లా ముత్తుకూరు మత్స్యకళాశాలకు చెందిన విద్యార్థులు చేపల పెంపకంపై క్షేత్రపరిశీలన చేశారు. కైకలూరు మత్స్యశాఖ అధికారులు విద్యార్థులకు చేపల సాగు చేసే విధానాన్ని, చేపల వినియోగించే మేతలు, మందులు, సీడ్ ప్లాంట్లు, కొల్లేరు సంప్రదాయ వేటచేసే పద్ధతులను వివరించారు. ఆటపాకలో తెల్లచేపలు, పంగస్‌జాతి చేపలు సాగు చేసే యాజమాన్య పద్ధతులను ప్రత్యక్షంగా తిలకించారు. విద్యార్థులు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతం చేపలకు ప్రసిద్ధి అని, వినడమే తప్ప ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదని ఈ పర్యటన వల్ల ఎంతో అవగాహన కలిగిందన్నారు. మత్స్యకళాశాల ప్రొఫెసర్లు మాధవి, జస్మితా, మేఘనస్వప్న, మత్స్యశాఖ అధికారులు పి.గణపతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పారా స్విమ్మింగ్ పోటీలు

■ లోపలి పేజీలో..



కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక భవనం

కేంద్రీయ విద్యాలయం కలేనా..?

» ఐదేళ్లుగా నూజివీడువాసులను మురిపిస్తున్న కేంద్రీయ విద్యాలయం

» రూ.70 లక్షల వ్యయంతో తాత్కాలిక భవనాలు సిద్ధం

» గత ప్రభుత్వంలో ఏడెకరాలు మంజూరు

(నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి)

నూజివీడుకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభం అవుతాయో.. అసలు నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం మంజూరైందా? లేదా? అనే అనుమానాలు నూజివీడు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రీయ విద్యాలయం మంజూరైందని, ఈ మేరకు నూజివీడులో రాజీవ్‌గృహకల్పకు ఇచ్చిన 7 ఎకరాలను కేంద్రీయ విద్యాలయానికి కేటాయిస్తున్నట్టు రాష్ట్రప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెబుతూ తాత్కాలిక భవనాలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆమేరకు నాటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నేతృత్వంలో రూ.70 లక్షలు మున్సిపల్ నిధులు ఖర్చు చేస్తూ నూజివీడు ఎంప్లాయిస్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను నవీకరించారు. ఇదంతా జరిగి దాదాపు నాలుగేళ్లు గడిచింది. అయితే కేంద్రీయ విద్యాలయం ఏమైందో, అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభం అవుతాయో తెలియని పరిస్థితి. తాజాగా నూజివీడు సబ్‌కలెక్టర్ కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన ప్రదేశంలో ఉన్న వృక్షాలను వేలం వేస్తే దాదాపు రూ.25 లక్షల వరకు ఆదాయం లభించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలం అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉండడంతో కేంద్రీయ విద్యాలయంపై స్థానికుల్లో ఆశలు తిరిగి రేకెత్తాయి. అయితే ఆ సంస్థకు సంబంధించి ఉన్నతాధికారులు వచ్చి తాత్కాలిక భవనాలను, విద్యాలయానికి కేటాయించిన భూమిని పరిశీలించి వెళ్లడమే తప్ప విద్యాలయం ఎప్పుడు ప్రారంభవుతుందో చెప్పకపోవడం గమనార్హం.

మద్యం ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై దాడులు

10 మంది అరెస్టు



అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, చిత్రంలో మద్యం బాటిళ్లు

ఏలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం మద్యం ఎంఆర్‌పీ ధరల ఉల్లంఘనలపై, అనధికార మద్యం విక్రయాలపై దాడులు చేసి 10 కేసులను నమోదు చేసి 10 మందిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. వీరి నుంచి 71 నిబ్స్ డ్యూటీపైడ్ మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

దెందులూరు నియోజకవర్గంలో..

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య ఆదేశాల మేరకు దెందులూరు మండలం అప్పారావుపాలెంలో ఆరు మద్యం సీసాలతో తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఏలూరు ఎక్సైజ్ సీఐ జీఎస్ కృష్ణ ధనరాజ్, ఎస్ఐలు పి సుధీర్, వై గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి : ఒకరి అరెస్ట్

చింతలపూడి : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పొనుకుమాడులో బెల్టు షాపులపై దాడి చేయగా ఆ గ్రామానికి చెందిన గంగుల తిరుపతయ్య నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.



పోటీలో తలపడుతున్న పారా స్విమ్మర్లు, విజేతలు

ఉత్సాహంగా పారా స్విమ్మింగ్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడవ రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర గ్రంథా లయ ఛైర్మన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. క్రీడారంగంలో ప్రతిభ చాటిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించిందన్నా రు. కార్యక్రమంలో యూడ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థ సారథి, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలో రాష్ట్రవ్యాప్తంగా 120 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారు. తమ సత్తా చాటి పతకాలు సాధించారు. స్విమ్మింగ్ కోచ్ బండ్ల గణేశ్ పర్యవేక్షించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెం మద్ది అంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు. ప్రతీ ఆదివారం హనుమద్ హోమం నిర్వహిస్తున్నట్లు చందన తెలిపారు.



మండలపు రవిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మండలపు రవికి ఆత్మీయ సత్కారం

ఏలూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ రాష్ట్ర ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ నేత మండల రవికి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో పలువురు టీడీపీ నేతలు ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మండలపు సాయిబాబా చౌదరి, వంగవోలు కృష్ణప్రసాద్, మండలపు మోహన్, మండలపు జగదీష్, దండా బుచ్చిబాబు, ఇనగంటి శ్రీనివాసరావు, మండలపు వీరభద్రరావు ఘనంగా సత్కరించారు.

వంకాయ కిలో రూ.100

- తగ్గని కూరగాయలు
- కడప ఉల్లి ధమాల్
- పెరిగిన చికెన్

తాడేపల్లిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో వంకాయల ధరలు ఆకాశాన్నంటాయి. గత వారం కిలో రూ.60 ఉన్న ధర ఆదివారం రూ.వంద పలికింది. దసరా శరన్నవరాత్రులు వెళ్లిన తరువాత కూరగాయల ధరలు తగ్గుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. బెండకాయలు కిలో రూ.30, బీరకాయలు రూ.50, దొండకాయలు రూ.40, కాకర రూ.50, ఆగాకర రూ.120, కార్యరెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, చిక్కుళ్లు రూ.120, టమాటా రూ.40, పచ్చిమిర్చి రూ.60 ధరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సిద్దాంతం, ఖండవల్లి, కొయ్యలగూడెం, లింగారాయుడుగూడెం, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, లింగపాలెం, కన్నాపురం, పోలవరం, బుట్టాయిగూడెం, పెదవేగి ప్రాంతాల్లో విస్తారంగా కూరగాయల తోటలు వేశారు. ఇటీవల వర్షాలకు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయలకు ఇప్పుడు ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తుంది.

కడప ఉల్లి పతనం

మార్కెట్లో కడప ఉల్లి ధర పతనమైంది. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు 6 లారీలో కడప ఉల్లి వచ్చింది. దీని ధర క్వింటా రూ.500 నుంచి రూ.1000 మధ్య విక్రయాలు జరిగిగాయి. ఉల్లి నాణ్యత లేకపోవడంతో ధర తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి 10 లారీల ఉల్లి వచ్చింది. దీన్ని క్వింటా రూ.1200 నుంచి రూ.1800 మధ్య విక్రయాలు జరిగాయి. ఇక రిటైల్ వ్యాపారులు రూ.100కు నాణ్యమైన ఉల్లి నాలుగు కిలోలు, మధ్య, నాసిరకం కలిపి ఉల్లి రూ.100కు 5 నుంచి 6 కిలోల వంతున అమ్మారు.

పెరిగిన చికెన్ ధర

తణుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వారం రోజుల నుంచి ధర పెరుగుతోంది. కేజీ స్కిన్ లెస్ రూ.240 నుంచి



రూ.280 వరకు పెరిగింది. ఆదివారం మార్కెట్లో స్కిన్ లెస్ కేజీ 260 నుంచి రూ.280 ధరకు విక్రయించారు. కొన్నిచోట్ల ఇంకా తక్కువగా కూడా అమ్ముతున్నారు. స్కిన్‌తో రూ. 240 ధరకు అమ్ముతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ధరల్లో వ్యత్యాసం కనబడింది. షాపులు అద్దె, నిర్వహణ ఉన్న చోట ఒకలా, చిన్న షాపులు, గ్రామాల్లో నిర్వహణ పెద్దగాలేని చోట మరోలా ధరలు ఉన్నాయి.



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొన్న గంజాయి

గంజాయి రవాణా.. ఇద్దరు అరెస్టు

తణుకు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్సైజ్ అధికారులు సోదాల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్టు చేశారు. ఉండ్రాజవరం సెంటర్ నుంచి పాలంగి రోడ్డులో ఎక్సైజ్ అధికారులు తనిఖీ నిర్వహిస్తుండగా స్కూటీలో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిగని గుర్తించారు. వారి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి చెప్పారు. నిందితులను పైడిపర్రు, మండపాక గ్రామానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. ముగ్గురిలో పరారైన పోలవరపు కుమార్ శివ పట్టుబడిన మీసాల ఈశ్వరరావు, చీలి వినయ్‌కు గంజాయి సరఫరా చేస్తున్నాడు. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణ పరిసరాల్లో విక్రయిస్తున్నట్ల దర్యాప్తు తేలిందన్నారు. కేజీ గంజాయి రూ.3వేలు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 15 వేలు ఉంటుందన్నారు. గంజాయి నిల్వ, రవాణా, అమ్మకాలు సమాచారాన్ని 94409 02436 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

కాలువలో బాలుడి గల్లంతు



తణుకు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పైడిపర్రులో కాలువలో మునిగి బాలుడు గల్లంతయ్యాడు. దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన బొమ్మన బోయిన శ్రీఅంజనేయులు తణుకులో ఒక పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడి కుమా రుడు జోగేంద్ర నందు (13) ఆదివారం పైడిపర్రు వంతెన వద్ద గల కాలువ రేవులో ఆదివారం మధ్యాహ్నం స్నానం చేస్తుండగా మునిగిపోయాడు. తణుకు రూరల్ పోలీసులు బాలుని ఆచూకీ కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

భీమడోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు భీమడోలు మండలం ఆగడాల లంక గ్రామానికి చెందిన సిరంగి మోహనరావు (40) మోటార్ సైకిల్‌పై గుండుగొలను వెళుతుండగా వడ్డిగూడెం సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహనరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

ఏలూరు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాల వద్ద గుర్తు తెలియని యువకుని మృతదేహం ఉందని రైల్వే పోలీసులకు ఆదివారం ఉదయం సమాచారం అందింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీనివాస్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే బ్రిడ్జి కింద రైలుపట్టాలపై మృతి చెంది ఉన్నాడు. సుమారు 30 ఏళ్ల వయసు, 5.5అడుగుల ఎత్తు, గోధుమరంగు ప్యాంటు, నలుపుతెలుపు చారల షర్టు ధరించి ఉన్నాడు. తలకు లోతైన గాయం, కాలు, చేయి విరుగడంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా గుర్తించారు. రైలు నుంచి జారిపడ్డాడా. రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగిందా అని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో గాయపడి..

కామవరపుకోట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆడమిల్లిలో ఈనెల 4న వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభంపై పనులు నిర్వహిస్తుండగా హెల్పర్ బోణాల వంశీ(22) విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆదివారం అంత్య క్రియలు పూర్తయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ఏలూరు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన ఘంటసాల సోమరాజు (44) ఈనెల 6న ఉదయం కొల్లేరులో చేపల వేట ముగించుకుని మోటారు సైకిల్‌పై వెళుతుండగా అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిని అతడిని ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్ట్

ఏలూరు క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తి ని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మాదేపల్లిరోడ్డులోని మహ్మద్ నజీర్ (43) బాణసంచా సామగ్రిని అక్రమంగా నిల్వ ఉంచారు. తారాజువ్వలు, 500 వాలాస్, సుమారు రూ.50,700 పలు రకాల బాణసంచా నిల్వ ఉంచారు. ఎలాంటి అనుమతులు లేవు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ బి.నాగబాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేసి మహ్మద్ నజీర్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న మందు గుండు సామగ్రిని సీజ్ చేశారు.

జీఎస్టీ భారం!

సడలింపులు లేకుండా మందుల విక్రయం

మూడు దుకాణాలపై కేసు

ఏలూరు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ సడలించినా కొందరు వ్యాపారులు ధర తగ్గించడం లేదు. పాత జీఎస్టీ ప్రకారమే మందులను విక్రయిస్తున్న చింతలపూడిలో రెండు, ఏలూరులో ఒక మందుల షాపు నిర్వాహకులపై అధికారులు కేసులు నమోదు చేశారు. జిల్లా ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణచక్రవర్తి ఆదివారం వివరాలు తెలిపారు. చింతలపూడిలో 8 దుకాణాల్లో అధికారులు తనిఖీ చేశారు. విన్‌కేర్ షాపు, మరో దుకాణం, ఏలూరులోని స్వాతి మెడికల్స్‌లో ఉల్లంఘనలు జరిగినట్టు గుర్తించామన్నారు. ఔషధ ధరలకు సంబంధించి 18, 12 శాతం శ్లాబ్‌లలో ఉన్న మందులను 5శాతం శ్లాబ్‌లోకి తీసుకువచ్చారని, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాదులకు సంబంధించిన మందులకు పూర్తిగా జీఎస్టీని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మినహాయించాయన్నారు. దీనికి భిన్నంగా కొన్ని దుకాణాల యజమానులు ఔషధ విక్రయాల బిల్లింగ్ ప్రాసెస్‌లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోకుండా వినియోగదారుల నుంచి పాత జీఎస్టీనే వసూలు చేస్తున్నాయని, ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేశామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని మందుల దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతాయని, పాత జీఎస్టీని వసూలు చేసేవారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు కొనుగోలుచేసిన ప్రతీ ఔషధానికి తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని, ఔషదాలకు సంబందించి జీఎస్టీ ఉల్లంఘనలపై ఫోన్ నంబరు 94910 63158కు ఫిర్యాదుచేయాలని కోరారు. ఆకస్మిక తనిఖీల్లో జంగారెడ్డిగూడెం, తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకున్న యువతి

మృతిపై అనుమానాలు

దెందులూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందింది. మండలంలోని సానిగూడెంలో నేతల నీలమణి(19) భర్త, అత్తతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో చీరతో ఉరివేసుకుని ఇంట్లోనే మృతి చెంది ఉంది. భార్యాభర్తల గొడవల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. భర్త ఫిర్యాదుతో పోలీ సులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను విచారిస్తున్నారు. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు ఎస్ఐ శివాజీ తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తరలెళ్లిపోతున్న పల్లె జనం

(మొదటి పేజీ తరువాయి)

50 నుంచి 100 కుటుంబాలకు పైగా ఇప్పటికే ఊరు వదిలి వెళ్లారు. ముఖ్యంగా తెలంగాణలోని మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు, ఏపీలోని గుంటూరు జిల్లాకు వెళ్తున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పది వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకొని సుగ్గి బాటన సాగిపోయి ఉంటారని అనధికారిక అంచనా. దీంతో గ్రామాలన్నీ బోసిపోతున్నాయి. తల్లిదండ్రులతో పిల్లలు కూడా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరు తగ్గిపోతోంది.



వలస వెళ్తున్న పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న వృద్దులు

కిలో పత్తి తీస్తే రూ. 15

కర్నూలు జిల్లాలో 5.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అత్యధికంగా పత్తిసాగు చేసిన జిల్లాల్లో గుంటూరు తర్వాతి స్థానం దీనిదే. అయితే అధిక వర్షాలకు తేమ ఎక్కువై చెట్టుపైన కాయలు నల్లగా మారి కుళ్లిపోయాయి. ఉన్న అరకొర పత్తి చెట్టుపైనే మొలకలొచ్చి నేలపాలయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు పైగా దిగుబడి రూపంలో నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద రైతులు పత్తితీత పనులకు పిలిచినా రూ. 300-400 మించి కూలి ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా ఉపాధి హామీ కూలి డబ్బులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం అవుతుండటంతో వలసబాట పట్టారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, గుంటూరులో కిలో పత్తి తీస్తే రూ. 15 నుంచి రూ. 18 చొప్పున ఇస్తున్నారు. 'దంపతులిద్దరూ రోజుకు వంద కిలోల పత్తి తీస్తే రూ. 1,500 వస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా పనిలోకి వెళితే మరో రూ.వెయ్యి సంపాదించవచ్చు. ఇలా రోజుకు సుమారు రూ. 2,500, నెలంతా కష్టపడితే దాదాపు రూ.50 వేల నుంచి 60 వేలు సంపాదించుకోవచ్చని వలస బాట పట్టారు. గుంటూరు జిల్లాలో పత్తి తీత పనులు అయిపోగానే మిరప కోత పనులు మొదలవుతాయి. నాలుగైదు నెలలు పనులు ఉంటాయని ఆ జిల్లాకు ఎక్కువ వెళ్తున్నారు.

ఆ ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణే ప్రధాన లక్ష్యంగా 2019లో నాడు టీడీపీ ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకూ పనుల్లో కదలికలేదు.

ఆరెకరాలున్నా.. వలస బాటే


చింతకుంటకు చెందిన పుసులు యల్లప్ప, పద్మ దంపతులకు బోరుబావి కింద ఆరెకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో పత్తి, మరో 3 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. రూ.4 లక్షలకు పైగా అప్పు చేశారు. ధరలు పతనమవడంతో ఉల్లి పంటను పొలంలోనే వదిలేశారు. అధిక వర్షాలకు పత్తికూడా పాడైపోయింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బడికి వెళ్లే ఇద్దరు పిల్లలను తీసుకొని వికారాబాద్‌కు వలస వెళ్తున్నానని యల్లప్ప చెప్పాడు.

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెసీమల వలసలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

యూజ్‌లెస్ ఫెలో.. ఎవడ్రా నువ్వు!

- ఎమ్మెల్యే బూర్లపై నోరు పారేసుకున్న మాల మహానాడు నేత గొల్ల
- తురకపాలెం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. తురకపాలెంలో వరుస మరణాల నేపథ్యంలో ఆదివారం ఆయా కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 28మందికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీచేశారు. ఈ సాయం ప్రభుత్వం చేస్తోందని, దళారులు డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుణ్ కుమార్ ఎమ్మెల్యేను చూస్తూ అంత దౌర్భాగ్యం తమకు రాలేదన్నారు. ఒక సమయంలో నియంత్రణ కోల్పోయి ఎమ్మెల్యే వైపు వేలు చూపిస్తూ 'ఎవడ్రా నువ్వు.. యూజ్ లెస్ ఫెలో' అంటూ దూషించడంతో పాటు తిట్లపర్వం అందుకున్నారు. ఈ ఘటనతో కేంద్ర మంత్రి, అధికారులు షాకయ్యారు. ఎమ్మెల్యే మీదకు దూసుకువచ్చిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీసుకువెళ్లి పోయారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. మా ఊళ్లో మీ పెత్తనం ఏమిటని నిలదీశారు. కాగా, కొందరు బాధితులు తమకూ ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.



ఎమ్మెల్యే బూర్లకు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

- బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి'తో సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్న

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



"డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ ఛైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు.

ప్రశ్న: డిజిటల్ ప్లంబింగ్ అంటే..?

రాజు వేగేశ్న: సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

భారీగా ఉద్యోగాలు వస్తాయా?

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఎలాగైతే ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నాయో.. డేటా సెంటర్లు కూడా ఆ విధంగానే పనిచేస్తాయి. వీటి వల్ల ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నా.. పరోక్షంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐటీలో అగ్రస్థానంలో ఉన్న బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది.

ఈ రంగంలో మీకున్న అనుభవం ఏమిటి?

భారత్‌లో 25ఏళ్ల క్రితమే డేటా సెంటర్లను సిఫీ ప్రారంభించింది. ముంబైలో 250 మెగావాట్లు, నోయిడాలో 130 మెగావాట్లు, చెన్నైలో మరో 130 మెగావాట్ల డేటా సెంటర్లు నిర్వహిస్తున్నాం. నాస్డాక్‌లో నమోదైన రెండు కంపెనీల్లో ఒకటి ఇన్ఫోసిస్ అయితే రెండోది సిఫీ. డేటా సెంటర్ ఆపరేషన్లు రెండేళ్లలో ప్రారంభించాలనే లక్ష్యంతో విశాఖ వచ్చాం. నేనూ ఏపీకి చెందినవాడినే. మంత్రి లోకేశ్ చాలాకాలం నుంచి తెలుసు. విశాఖ కాస్మోపాలిటన్ నగరం. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఎటువంటి భేదభావాలు లేకుండా కలిసి మెలిసి ఉంటారు. ఇక్కడ అందమైన బీచ్‌లు ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటి కంటే మంచి పాలసీలు, పూర్తి సహకారం అందించే ప్రభుత్వం ఉండటం వల్లనే ముందుకొచ్చాం.

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రుషికొండ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిఫీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని లోకేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, ప్రసంగించారు. గత 17 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అందులో 50శాతానికి పైగా విశాఖ జిల్లాకే వచ్చాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు భారీగా రావడం ఇదే మొదటిసారని, ఇదంతా ఒక్కరోజులో సాధ్యం కాలేదని చెప్పారు. సుదీర్ఘ చర్చలు, అనేక మంది కీలకంగా వ్యవహరించడం వల్లనే వచ్చాయన్నారు. సిఫీ సంస్థను ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు పట్టిందన్నారు. రాష్ట్రానికి విశాఖపట్నమే ఆర్థిక రాజధాని అని, అభివృద్ధి విషయంలో వికేంద్రీకృత విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఒక్క విశాఖలోనే 5లక్షల ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. టీసీఎస్‌కు ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే విమర్శించారని, అయితే ఆ నిర్ణయం కారణంగా కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్, సత్వాల్, గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు వచ్చాయన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతో కూడా పోటీ పడుతోందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కేంద్రంగా ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఏ జీసీసీ అయినా ఏపీకే రావాలన్నారు.

బుల్లెట్ ట్రైన్ వేగం

ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారు మాత్రమే కాదని, బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోయే ప్రభుత్వమని లోకేశ్ అభివర్ణించారు. ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఢిల్లీ వెళితే... ఏపీకి వెళ్లాలని, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం ఉందని సూచిస్తున్నారని, అది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రైల్వే జోన్ సాధించుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంటు కష్టాల్లో ఉంటే కేంద్రం రూ.11,440 కోట్లు ఇస్తే రాష్ట్రం రూ.4 వేల కోట్ల సాయం అందిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంటు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో నడిస్తే ఇప్పుడు 3 బ్లాస్ట్ ఫర్నేసులతో 85% ఉత్పత్తి చేసే స్థాయికి చేరిందని తెలిపారు. మరో 3 నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం బ్లాంక్ చెక్ ఇచ్చిందని, దాంతో దూకుడుగా వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సిఫీ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. తొలిదశలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు.



సిఫీ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేశ్

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్: లోకేశ్

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు 4 జిల్లాలతో 'గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మహా విశాఖ ఆర్థిక మండలి' నిర్వహణ, విధివిధానాలపై సీఎం ప్రకటన చేస్తారని చెప్పారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి రోడ్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, కంపెనీల ద్వారా 5లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన రూ.లక్ష కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌కు వచ్చాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే గ్రేటర్ జోన్ ఆర్థిక వృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వచ్చేనెల 14, 15ల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో మరిన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదేనన్నారు. టీసీఎస్‌కు కేటాయించిన భూముల్లో వచ్చే నెలలో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. డిసెంబరులో కాగ్నిజెంట్ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఈవో వస్తున్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విశాఖలో ఏర్పాటుకాబోతున్నదన్నారు.

నేటి నుంచి అష్టోత్తర శత చండీ యాగం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రహారంలోని నగరేశ్వరస్వామి ఆలయం వద్ద కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం ఆధ్వర్యంలో అష్టోత్తర శత చండీయాగాన్ని ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు సత్రం నిర్వాహకులు, ఈవో నాగబాబులు తెలిపారు. యాగంలో ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరుగుతాయన్నారు. 16వ తేదీన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు, సువాసినీలచే కలశాలతో ఊరేగింపు, 17న శాంతి కల్యాణం, అన్నదానం జరుగుతుందన్నారు.

నేటి నుంచి 50 రోజుల పాటు స్వాములకు నిత్య భిక్ష

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీ నుంచి 50రోజుల పాటు అన్నపూర్ణాసహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో సర్వమాలధారులకు నిత్య భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి స్వామివారికి పూజా మహానైవేద్యం, హారతి, అనంతరం స్వాములకు భిక్ష కార్యక్రమం జరుగుతుందని అన్నదాన సమాజం అధ్యక్షులు కొట్టు మధు వెంకట్రావు తెలిపారు.

యాదవ కల్యాణ మండపానికి నిధులు కేటాయించండి

ద్వారకాతిరుమల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండప అభివృద్ధి నిమిత్తం రూ.50 లక్షలు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్‌ను జిల్లా యాదవ సంఘసభ్యులు కోరారు. విజయవాడలో ఆయనను వీరంతా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం చినవెంకన్న మెమెంటోను అందజేశారు. నిధులు కేటాయించడం పట్ల ఆయన సానుకూలంగా స్పందించినట్లు నేతలు చెప్పారు. జిల్లా యాదవ సంఘ నేతలు ముమ్మిడి చింతయ్య, కూరాకుల బుజ్జి, కాట్రు బాలకృష్ణ, సిదరబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభను జయప్రదం చేయండి

ఉంగుటూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో ఈ నెల 30,31 తేదీల్లో జరిగే జిల్లా రైతు మహాసభను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం గ్రీన్ ఫీల్డ్ భూములతో పాటు మెట్ట ప్రాంతంలోని కోకో, కొబ్బరి, పామాయిల్ తదితర వాణిజ్య పంటల రైతుల సమస్యలను పరిష్కరించగలిగామని భవిష్యత్తులో ప్రతి ఏటా జరిగే రైతు మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రైతు నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

కొక్కిరపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పెదపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెదపాడు మండలం కొక్కిరపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం ఆదివారం జరిగింది. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాశారని అన్నారు. దీని ద్వారా సమాజంలోని కులమతాల అసమానతలు తొలగిపోతాయని, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షులు అరుణ్ కుమార్ తెలిపారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో ధార్విక్‌కు రెండు మెడల్స్


మెడల్స్ సాధించిన చిన్నారులు

టి.నర్సాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెంలో జరిగిన పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో మండలంలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన బాలుడు దీరం ధార్విక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. తాడేపల్లి గూడెంలో నాలుగు నుంచి ఆరేళ్ల వయస్సు గల బాలురకు నిర్వహించిన రోలర్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న ధార్విక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచి రెండు పతకాలు సాధించినట్టు తెలిపారు. చిన్న వయస్సులో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థిని గ్రామస్థులు అభినందించారు.

ధన్వంతరి జయంతిని అధికారిక పండుగగా ప్రకటించాలి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తొలివైద్యుడు, నాయీబ్రాహ్మణ కులదైవం ధన్వంతరి జయంతిని ప్రభుత్వ పండుగగా ప్రకటించి అధికారికంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్. నందీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 18న చింతలపూడిరోడ్డులో శుభలేఖ కల్యాణ మండపంలో ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆహ్వానించారు. నందీశ్వరరావు మాట్లాడుతూ ధన్వంతరి ఉత్సవాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి మంత్రి సవిత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి జీఓ విడుదల అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, పవన్, కే.రాజు, చందు పాల్గొన్నారు.

కిటకిటలాడిన గుబ్బల మంగమ్మ సన్నిధి



బుట్టాయగూడెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో భక్తులు వందలాదిగా ఏజెన్సీకి తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే భక్తుల తాకిడి మొదలైంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు త్వరగా దర్శనాలను ముగించుకుని తిరుగు ప్రయాణం కావాలని కమిటీవారు స్పష్టం చేయడంతో సాయంత్రం భక్తులు వెనుదిరిగారు.

విదేశాల్లోని డబ్బును స్వదేశానికి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివరామకృష్ణ

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న లక్షల కోట్ల రూపాయలను స్వదేశానికి తీసుకురావాలని టీమ్ ఫర్ గుడ్ గవర్నర్స్ అధ్యక్షులు కమ్మ శివరామకృష్ణ డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆదివారం ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని కేవలం 20 శాతం ప్రజలకు మాత్రమే సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి నాగ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కామవరపుకోట మండలాధ్యక్షులు అబ్బూరి లక్ష్మీనారాయణ, కార్యదర్శి అయినాల శ్రీనివాసరావు, జాయింట్ కార్య దర్శి నరసింహరావు, ఏలూరు అధ్యక్షులు యుగంధర్ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్య దర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):తన కుమారుడు మృతి చెందాడనే మనస్తాపంతో మతి స్థిమితం కోల్పోయిన కొండేపూడి నాగమణి(40) అనే మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారంతో ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కొండేపూడి నాగమణి స్థానిక మున్సిపాలిటీలో పారిశుద్య కార్మికురాలిగా పని చేస్తోంది. బైపాస్ రోడ్డులోని ముత్యాలమ్మ నగర్‌లో తన కుటుంబంతో నివాసముంటోంది. ఆమెకి భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం కుమారుడు మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమెకు మతిస్థిమితం లేదు. కుమారుడు చనిపోయాడని, తాను కూడా ఏదో ఒకరోజు చనిపోతానని నాగమణి తన కుమార్తెతో చెబుతూ ఉండేది. ఈ నేపథ్యంలో నాగమణి ఆదివారం స్థానిక గరుడ పక్షి నగర్ వద్ద ఉన్న పంట పొలాల్లోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

ఉంగుటూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం నారాయణపురం షిర్డీ సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవం ఆది వారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అక్కిన లక్ష్మీనారాయణ, స్వరాజ్య లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనం తరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

లైన్ క్లియర్

(5వ పేజీ తరువాయి)

పిచ్చిమొక్కలు తొలగించి కుడికాల్వ రిటైనింగ్ పనులు చేపట్టారు. పనులు వేగవంతం చేసి వర్షాకాలంలోపు పూర్తి చేయాలని నిర్ణయించినా నిధుల లేమితో అవలేదు.

రానున్న సీజనే కీలకం : తమ్మిలేరు వరదలు వర్షాల తర్వాత ఎండిపోనుంది. వాస్తవంగా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు తమ్మిలేరులో డెడ్ స్టోరేజీకి వాటర్ నిల్వలు పడిపోతాయి. అప్పుడు పనులు పూర్తి చేయడానికి అనుకూలంగా ఉంటుంది. మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు వేగంగా ప్రారంభం అయ్యాయి. కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్ల మేర ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లింపు జరగలేదు.

ఉపాధి జాబ్ కార్డులకు ఈకేవైసీ

ముఖ ఆధారిత హాజరుతో అర్హులకు న్యాయం


ముఖ హాజరు వేస్తున్న ఉపాధి సిబ్బంది

ఏలూరురూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో బోగస్‌ల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనర్హుల జాబ్‌కార్డులను తీసి వేయడంతో పాటు దొంగ మస్టర్లకు చెక్ పెట్టాలన్న ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. కార్డులను ఈజేవైసీ చేయాలని ఆదేశించడంతో మండలంలోని ఉపాధి హామీ అధికారులు ఏలూరు రూరల్ మండలంలో ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు, వాస్తవంగా హాజరవుతున్న సంఖ్యకు పొంతన ఉండడం లేదు. ఇలాంటివి అరికట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను చేపట్టింది. అలాగే ముఖ హాజరు అమలు చేయాలని నిర్ణయించింది. దీని వలన పథకంలో యంత్రాల వినియోగంతో పాటు పనిప్రదేశాల మార్పు, దొంగ ఫొటోలు, ఒకరికి బదులు మరొకరు పనులకు రావడం, కూలీల సంఖ్యను అధికంగా చూపడం వంటి వాటికి బ్రేక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో సుమారు 40 వేలుకు పైగా జాబ్ కార్డులు ఉండగా 80 వేల మంది కూలీలు పనిచేస్తున్నారు.

తగ్గనున్న మెటీరియల్ కోటా నిధులు

ఉపాధి హామీ పథకం ద్వారా చేసే మొత్తం పనులు అంచనాలో 60 శాతం కూలీలు చేయాల్సి ఉంది. మిగతా 40శాతం నిధులను కేంద్రం మెటీరియల్ కోటా కింద ఇస్తుంది. కూలీలు చేసిన పని ప్రకారమే మెటీరియల్ కాంపొండెంట్ నిధులు వస్తాయి. కూలీల సంఖ్యను పెంచాలని అధికారులపై ఒత్తిడి ఉండటంతో ఇప్పటి వరకు ఏదోవిధంగా కూలీల నమోదు అధికంగా చూపుతున్నారు. వేలిముద్రలు, ముఖ ఆధారిత డిజిటలైజేషన్ ద్వారా బోగస్ కూలీల సంఖ్య తగ్గిపోనుంది. దీంతో మెటీరియల్ కాంపౌండ్ నిధులు కూడా తగ్గిపోతాయని పలువురు అంటున్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీ వివరాలను ఉపాధి పథకం సిబ్బంది గ్రామాలలో నమోదు చేస్తున్నారు. కూలీల వేలి ముద్రలు, ఐరిష్ ముఖం డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. చేసిన పనిని బట్టి కూలీలకు అధిక వేతనం లభిస్తుంది.

ముండూరు సొసైటీలో ఉచిత వైద్య సేవలు


వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించే వీలుంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజయవాడ సెంటినీ ఆస్పత్రి సహకారంతో పెదవేగి మండలం ముండూరు సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ, వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో విజయవాడ సెంటినీ ఆస్పత్రి వైద్యులు గుండె వైద్య నిపుణులు కాగిత కృష్ణచంద్, మాధురి, న్యూరాజిస్టులు డాక్టర్ కాగిత రాకేశ్, లక్ష్మీభావనలు వైద్య సేవలందించారు. 300మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ కొనకళ్ల శివమణి, కార్యదర్శి బీవీఎస్వీ ప్రసాదరావు, వేగివాడ, తాళ్లగోకవరం గ్రామ సర్పంచ్‌లు పంది ప్రభావతీ సూర్యచంద్రరావు, నెక్కలపూడి సురేష్‌బాబు, పార్టీ నాయకులు ఈడ్పుగంటి అనిల్, బలుసు శ్రీనివాస్‌చౌదరి, లోకేశ్వర శ్రీనివాస్, షేక్ ఉద్దండు పాల్గొన్నారు.

● పెదవేగి మండలం కవ్వగుంటలో శ్రీకోదండ రామస్వామి ఆలయ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని పాల్గొన్నారు. గ్రామస్తులు సుగసాని గంగాధరరావు, కొట్టే నరేష్, విజయరాయి సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుధాకర్, టీడీపీ నాయకులు ఈడ్పుగంటి అనిల్ పాల్గొన్నారు.


అమ్మవారి సన్నిధిలో ఉన్న రెడ్డి అప్పలనాయుడు

సందడిగా గంగానమ్మ సంబరాలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని 2, 3, 6 తదితర డివిజన్లలోని గంగానమ్మ ఆలయాల వద్ద సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని చలివేంద్రాలు, వేడిమి పారాలు సమర్పించి భక్తి సంకీర్తనలు ఆలపించి, భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో గంగానమ్మ ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ ఆలయాల వద్ద సాయంత్రం వేళల్లో అమ్మవారి ప్రతిమతో మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఊరేగింపులు నిర్వహించారు. ఈ మేరకు సర్వత్రా సందడి నెలకొంది. ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో పాటు ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కూటమి నాయకులు గాడి బాలాజీలు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య ట్రాఫిక్ రద్దీ నెలకొనడంతో పడ్డారు. కిలో మీటరు దూరానికి 2 గంటల సమయం పట్టింది. పోలీసులు రంగప్రవేశం చేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పూజా రుసుములు ద్వారా రూ.95,510, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.34,725, ఫోటో విక్రయాల ద్వారా రూ.5590 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.


గస్తీ నిర్వహిస్తున్న శక్తి టీమ్.. విద్యార్థులకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ముమ్మరంగా శక్తి టీమ్ పోలీసుల గస్తీ

మహిళల్లో అవగాహనకు విశేష కృషి

సైబర్ నేరాల పట్ల అలర్ట్

ఏలూరు క్రైం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శక్తిటీమ్ పోలీసులు విస్తృతంగా గస్తీ నిర్వహించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తిటీమ్ సభ్యులు ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల శక్తి టీమ్ సభ్యులు బహిరంగ ప్రదేశాల్లో వివిధ ప్రాంతాల్లో ఆదివారం విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించారు. మహిళలకు రక్షణగా వీరు గస్తీ నిర్వహించారు. విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించి వారి మొబైల్స్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు డయల్ చేస్తే పది నిమిషాల్లోపు శక్తిటీమ్ గస్తీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలను తెలుసుకోవాలన్నారు.ఫ్రెండ్ ట్రాకింగ్, సేఫ్టీ షేరింగ్ వంటి వాటిని స్నేహితులు, కుటుంబ సభ్యులతో లైవ్ లోకేషన్ పంచుకోవాలన్నారు. శక్తియాప్ ఆత్మవిశ్వాసం కలిగి ఉండడానికి నిదర్శనమని, మహిళలు ఎక్కడ ఉన్నా సురక్షితంగా ఉండేందుకు పోలీస్ శాఖ తీసుకున్న అద్భుతమైన చర్య అని వారు వివరించారు. ప్రతి మహిళ తమ ఫోన్‌లో యాప్ తప్పనిసరిగా ఉంచుకోవాలని శక్తిటీమ్ సభ్యులు మహిళలకు, యువతులకు, విద్యార్థినులకు సూచించారు.


కామవరపుకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పోతునూరు హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు

దెందులూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పోతునూరు జడ్పీ హైస్కూల్లో 2003-04లో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంజి రమేశ్, రైల్వే శాఖ అధికారి, బోయిన ఫణి కుమార్‌లు మాట్లాడుతూ 22 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సందడి చేశారు. పాతజ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాల రోజుల్లో చేసిన చిలిపి పనులు గుర్తు చేసుకున్నారు. పూర్వ గురువులు టి.అన్నమ్మ, సీతారామశాస్త్రి, అప్పారావు, రాజేంద్ర ప్రసాద్‌లను పూర్వ విద్యార్థులు సత్కరించారు. పూర్వ విద్యార్థులు కనకుల నాగశివ, పడమటి విజయలక్ష్మి, కె.జ్యోతి, వెంకటలక్ష్మి, కె.హరి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: కామవరపుకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-99లో ఆరవ తరగతి నుంచి టెన్త్ వరకు చదువుకున్న విద్యార్థులచే ఆదివారం పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులను సన్మానించారు. ఆటపాటలతో అలరించారు. ఉల్లాసంగా ఆటపాటలతో అందరిని ఆకట్టుకున్నారు.

ఘనంగా అన్న సమారాధన

భీమడోలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భీమ డోలు ఈతకోట వారి వీధిలో దసరా సందర్భం గా అన్న సమారాధన నిర్వహించారు. భీమ డోలు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీక రించారు. కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయం ప్రతిష్ఠ

పెదపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిగూడెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. సీతారాముడు, లక్ష్మణ, ఆంజనేయ, ద్వారపాలక శిఖర, ఆలయ జీవ ధ్వజ ప్రతిష్ఠలు వేదపండితులు, ఆలయ అర్చకులు, భక్తుల భగవన్నామ్మ స్మరణల నడుమ శాస్త్రోకంగా జరిగాయి. పూజా కార్యక్రమాల్లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత దేవాలయం వద్ద గోపూజ, వేదస్వస్తి, యంత్రస్థాపన, పండిత సత్కారాలు నిర్వహించి, దేవాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

సీఆర్‌రెడ్డి కళాశాలలో కరాటే పోటీలు

పెదపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులు జరిగిన ఆల్ ఇండియా షోటో ఖాన్ కరాటే ఛాంపియన్ కరాటే పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలబాలికలకు కటా, కుమితి, వెపన్ కటా అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఛాంపియన్ షిప్‌ను ఏలూరు క్రీడాకారులు సాధించగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖపట్నం, హైదరాబాద్ క్రీడాకారులు నిలిచారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. వివిధ ప్రాంతాల కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు.

పెదపాడు, అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం అప్పనవీడు, పెదపాడు గ్రామాల్లో అభయాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అయ్యప్ప, భవానీ మాలధారణ చేసిన స్వాములకు 41 రోజుల పాటు చేపట్టిన అన్నదాన కార్యక్రమాల్లో ఆదివారం పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భవానీలు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. మాలధారణ చేసిన స్వాములు అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు.


పూర్తిగా కూలిపోయిన ప్రహరీ

కూలిన ప్రహరీ నిర్మాణమెప్పుడో?

ఏలూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎన్‌ఆర్ పేట వద్ద డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ప్రహరీ గోడ గత నాలుగు నెలలు క్రితం కురిసిన భారీ వర్షాలకు కుప్పకూలింది. అప్పటి నుంచి డ్రెయినేజీ వ్యవస్థ ముందుకు సాగడం లేదు. పరిసరాలు అధ్వానంగా మారినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీనిపై డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ వద్ద ప్రస్తావించగా ఇక్కడ త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ట్రాన్స్ వరల్డ్ అనే సంస్థ కొంత విరాళం ఇవ్వడానికి ముందుకొచ్చిందని, అదనపు నిధులను సమకూర్చి సుందరీకరణ చేస్తామని స్పష్టం చేసింది.

సూర్య దేవాలయంలో అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో స్వామి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ మాసంలోని ఆదివారం కావడంతో పవరు పేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద భక్తులు స్వామివారికి అభిషేకాలు, అ ర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ప్రదిక్షణలు నిర్వహించి అర్చకులు రాళ్లబండి ఆదినారాయణ శర్మ ద్వారా రక్షా బంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించి భజనలు నిర్వహిం చి ఆరాధించారు. సూర్యనమస్కార పూజలు జరిపా రు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచం ద్రరావు మిత్రబృందం భక్తులకు ఏర్పాట్లు చేశారు.


కాలిపర్స్ కోసం వచ్చిన వృద్ధులు

62 మంది దివ్యాంగులకు కాలిపర్స్

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో కాళ్లను కోల్పోయిన దివ్యాంగులకు ఏలూరు, జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం స్ర్కీనింగ్ టెస్టులు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నలు మూలల నుంచి 82 మంది ఈ పరీక్షలకు హాజరుకాగా వీరిలో 62 మంది కృత్రిమ కాళ్ల కోసం ఎంపికైనట్టు జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దాసరి శేషు కుమార్ తెలిపారు. ఎంపికైన వారి నుంచి కొలతలు తీసుకున్నామని, పదిహేను రోజుల్లో కృత్రిమ కాళ్లను అందజేస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కొండపల్లి పండు, మద్దిపాటి నాగేశ్వరరావు, కన్నా హనుమంతరావు, అట్లూరి సురేశ్, ఖండవల్లి ఆశీర్వాదం, మేడిచర్ల రవి, ఏలూరు లయన్స్ క్లబ్ సభ్యులు కెబి.రావు, కె.శ్రీనివాస్, చలసాని అరుణ్ కుమార్, ఖమ్మం రోటరీ క్లబ్ సభ్యులు రంగారావు, సాంబశివరావు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులుండాలి

లింగపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బాణసంచా వ్యాపారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని సీఐ టి.క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నివాసాలకు దూరంగా ఉన్న గోదాముల్లో బాణసంచా నిల్వ చెయ్యాలన్నారు. అక్రమంగా ఎవరైనా నివాస ప్రాంతాల్లో నిల్వచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అక్రమంగా నిల్వచేసినట్టు తెలిస్తే స్థానిక ఎస్‌ఐ, సీఐలకు సమాచారం అందించాలని కోరారు. వ్యాపారులు గోదాములు, విక్రయ ప్రాంతాల్లో ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతులు లేకుండా తయారు చేసినా, విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

116 మంది అయ్యప్ప భక్తులకు భిక్ష

దెందులూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల దీక్షధారులకు దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త దోనేపూడి రాంబాబు, మహేశ్వరి దంపతులు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో 116 మంది పాల్గొని భిక్షను స్వీకరించారు. 32 సార్లు మాల ధరించిన గురు స్వాములు గంగరాజు గురుస్వామి,పరిటాల కొండస్వామి దుర్గాప్రసాద్, బిళ్ల వీర్రాజు, బుద్దా సాంబశివరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నిత్య భిక్షలో శ్రీధర్ స్వామిజీ..

కామవరపుకోట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో పది రోజులుగా అయ్యప్ప, భవాని భక్తులకు అయ్యప్ప అన్నదాన సమితి ఆధ్వర్యంలో నిత్య భిక్ష నిర్వహిస్తున్నారు. ఆదివారం పదవ రోజు కావడంతో ముక్కామల మహాక్షేత్ర స్వామిజీ శ్రీధర్ అయ్యప్ప భక్తులతో పాటు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.అయ్యప్ప స్వామికి శ్రీధర్ స్వామిజీ విశేష పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచాన్ని భక్తులకు అందించారు. స్థానికులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


వీల్ చైర్ అందజేస్తున్న దాతలు

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత

ఏలూరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యుడు కవులూరి మహేశ్ దంపతులు, శక్తి ప్రసాద్ దంపతులు సంయుక్తంగా నడవలేని స్థితిలో ఉన్న నాగమణి అనే వృద్ధురాలికి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ పరిధిలో 163వ సెక్షన్

ఉంగుటూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కైకరం నాగమ్మగుడి ఉత్సవాలు రచ్చకెక్కడంతో 163వ సెక్షన్ విధించారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈ గుడి నిర్వహణ జరుగుతోంది. అయితే ప్రభుత్వ శ్రేణులే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రతి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సహకారంతో అన్న సమారాధనలు నిర్వహించడం ఆనవాయితీ. గత మంగళవారం అన్న సమారాధన విషయంలో వివాదం తలెత్తడంతో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవడం తదనంతర పరిణామాలతో ఆదివారం స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ వైహూర్ణచంద్ర ప్రసాద్ భద్రతా చర్యలు చేపట్టారు. ఈ నెల 29వ తేదీ వరకు 163 సెక్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాంగణం హైస్కూలు ఆవరణలో ఉండడంతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.



ర్యాంపు కారణంగా బాలుడికి గాయం

ద్వారకాతిరుమల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆలయం తూర్పురాజగోపురం వద్ద భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ర్యాంపు మరమ్మతులకు గురైంది. దీంతో శనివారం ఓ గుర్తు తెలియని బాలుడు కాలికి గాయమైనట్టు తెలిసింది. ఆలయంలోకి ప్రవేశించే భక్తులు తూర్పుగోపురంలో ఉన్న ర్యాంపు నుంచి దిగి లోనికి ప్రవేశిస్తుంటారు. అయితే ఆ ర్యాంపు కింద భాగంలో ఉన్న చెక్క ఊడిపోయి అక్కడ ఖాళీ ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. భక్తులు తెలియక దానిపై కాలువేస్తే ప్రమాదం తప్పదు. ఈ క్రమంలో ఓ యాత్రికుని కుటుంబానికి చెందిన బాలుడు శనివారం సాయంత్రం దానిపై కాలువేయడంతో గాయపడినట్టు తెలిసింది. సంబంధిత విభాగం అధికారులు మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

పేకాట స్థావరాలపై దాడి

లింగపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడే వారిపై కఠి నచర్యలు తీసుకుంటామని సీఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. మండలంలోని ధర్మాజీగూడెం గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ కె.వెంకన్నతో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 9మందిని అరెస్టు చేసి వారి నుంచి 14,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సమస్యలపై అర్జీల స్వీకారం : సబ్ కలెక్టర్

నూజివీడు టౌన్, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి):నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్టు సబ్ కలెక్టర్ వి.వినూత్న తెలిపారు. డివిజన్‌లోని మండల కార్యాలయాల్లోనూ, మున్సిపల్ కార్యాలయంలోనూ కార్యక్రమం నిర్వహిస్తారని, తమ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందజేయవచ్చునని, మరింత సమాచారం కోసం 1100 నెంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

సెల్ టవర్ వద్దంటూ నిరసన

నూజివీడు టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నివాసగృహాల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని నిరసిస్తూ నూజివీడు పాతపేట రజక సంఘం ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన చేపట్టారు. నూజివీడు పట్టణంలోని తిరువూరు రోడ్డులో గల ఓ దుకాణ సముదాయంపై సెల్‌టవర్ నిర్మిస్తుండటంతో సెల్ టవర్ల కారణంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారని దీనిపై మున్సిపల్ అధికా రులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని నూజివీడు సబ్ కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా రహదారికి మరమ్మతులు



మరమ్మతులు పరిశీలిస్తున్న కూటమి నాయకులు

కలిదిండి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్వానిగూడెం-పెదలంక ప్రధాన రహదారికి కూటమి నాయకులు, రైతులు ఆదివారం స్వచ్ఛందంగా మర మ్మతులు ప్రారంభించారు. 'వర్షాలతో రహదారి ధ్వంసం' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారుస్పందించారు. గోతుల్లో కంకర వేసి పూడ్చి రహదారిపై గుంతలను ఎక్స్‌కవేటర్‌తో చదును చేయి స్తున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా మట్టగుంట నుంచి పెదలంక వరకు 3 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎస్.వీరబ్రహ్మం, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కల బోసు పాల్గొన్నారు.

శ్రీశ్యామలాంబ ఆలయంలో అన్నసమారాధన


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న కామినేని

కైకలూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారి శరన్నవ రాత్రుల ముగింపును పురస్కరించుకుని అఖండ అన్నసమారాధనను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఆదివారం అమ్మవారి కళామండపం వద్ద జరిగిన ఈ అన్నసమారాధనలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసినందున ఉత్సవ కమిటీ, ఆలయ అధికారులను ఎమ్మెల్యే కామినేని అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఈవో వీఎస్‌కే శేఖర్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మామిడి ముందస్తు కాపు కోసం...


సోమవరంలో మామిడి తోటలో దమ్ము చేస్తున్న దృశ్యం

చాట్రాయి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో ముందుగా కాపు కాయించి అధిక ఆదాయం పొందటానికి రైతులు మేలైన యాజమాన్యం చేపట్టారు. మండలంలో 8 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉండగా అన్ని తోటల్లో మడికట్టు కట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మడులలో నీరు నిలవటంతో పాటు గడ్డి పెరగటంతో, ట్రాక్టర్లతో దున్ని దమ్ము చేస్తున్నారు. ఎరువులు వేసి సస్యరక్షణ చేస్తే ఒక నెల ముందుగానే పూత, కాపు వస్తుందని, ఏప్రిల్‌లో కాపు తేగలిగితే టన్ను రూ. లక్ష వరకు ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. మే నెలలో కాపు మొత్తం మార్కెట్‌కి రావటం వల్ల ధర టన్నుకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేలకు పడిపోయి నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటిస్తున్నట్టు వివరించారు.


బొమ్మినంపాడు హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అ'పూర్వ' కలయిక

ముదినేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మినంపాడు జడ్పీ హైస్కూలులో 1994-99 వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా సుమారు 15 ఏళ్ల అనంతరం కలుసుకొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులైన కొరగుంటపాలెం సర్పంచ్ పేరే రామకృష్ణ, యర్రంశెట్టి భరత్ కుమార్, ఎస్.రామాంజ నేయులు, అచ్యుత ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నాడు తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

వైద్యుల సహకారంతో..
ఆధునిక బస్ షెల్టర్
ప్రయాణికుల హర్షం


కైకలూరు తాలుకా సెంటర్లో ఏర్పాటుచేసిన నూతన బస్‌షెల్టర్

కైకలూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం... ప్రయాణికులు రాకపోకలు సాగించాలంటే అక్కడే వేచి ఉండాలి... ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు అక్కడ రోడ్డుపై నిలబడే బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించేవారు. అలాగే ఎండ, వానను సైతం భరిస్తూ ప్రయాణికులు రహదారిపైనే వేచి ఉండేవారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు వైద్యులు నడుం బిగించారు. అక్కడ బస్సు షెల్టర్‌ను నిర్మాణానికి సంకల్పించారు. స్వతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కైకలూరు తాలుకా సెంటర్‌కు పెద్దపేరు. ఆ సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ కూతవేటు దూరంలో ఉంటుంది. అలాగే ఏలూరు, భీమవరం, గుడివాడ, విజయ వాడ, ఆకివీడు తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆ సెంటర్లోనే బస్సులు ఎక్కాలి. ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ తాలుకా సెంటర్లో ఎక్కువమంది ప్రయాణీకులు బస్సులు, ఆటోల కోసం వేచియుంటారు. దీంతో కైకలూరు వరసంజీవిని ఆసుపత్రి వైద్యులు పీవీఎస్ పుల్లేశ్వరరావు, డి. జ్యోతిరాణి, పీవీఎస్ పూర్ణచంద్రరావు వారి తాతలైన పెరుమాళ్ళ పెద్దపూర్ణయ్య, వెంకట నరసమ్మ, అన్నం పుల్లయ్య, వెంకటరత్నం గార్ల స్మృత్యర్థం బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎమ్మెల్యే కామినేని దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో బస్సు షెల్టర్ నిర్మించారు. అక్కడ తెలుగుతల్లి, ప్రకా శం పంతులు, పొట్టిశ్రీరాముల విగ్రహాలను ఏర్పాటుచేసి ఆ సెంటర్‌కు కొత్త కళను తీసుకువచ్చారు. షెల్టర్‌లో ఫ్యాన్లు, లైట్లు సదుపాయాన్ని కల్పించారు. అలాగే పక్కనే ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ లోపల టైల్స్ వేసి, కరెంట్ సదుపాయాన్ని కల్పించి వినియోగంలోనికి తీసుకువచ్చారు. ప్రజాసేవలో వైద్యులు ముందుకు వచ్చి బస్‌షెల్టర్ ఏర్పాటుచేయడం పట్ల ప్రయాణికులు, కైకలూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీ వెరిఫికేషన్‌కు వెళ్లేదెలా?
90 కిలోమీటర్ల దూరం ఉందంటూ దివ్యాంగుల ఆందోళన

ముదినేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగులు పెన్షన్ల రీ వెరిఫికేషన్‌పై ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 87 మంది దివ్యాంగులపై ఇటీవల నిర్వహించిన రీ వెరిఫికేషన్‌లో వైద్యులు అనర్హత వేటు వేయగా, ఈ నెల 15, 16, 17 తేదీల్లో మళ్లీ నిర్వహించనున్న రీ వెరిఫికేషన్‌కు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు తదితర దూర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వాసుపత్రులకు వీరు ఎలా వెళ్లగలరన్న ఆలోచన అధికారులకు లేకుండా పోయింది. మండలంలో చాలా మంది దివ్యాంగులు పక్షవాతంతో మంచాన పడిన వారు, నడవలేని వారు ఉన్నారు. వీరంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశమే లేదు. 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న జంగారెడ్డిగూడెం వెళ్లాలంటే ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. దివ్యాంగులు ఏలూరు ఆసుపత్రికి ఎవరు వెళ్లాలి, జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి ఎవరు వెళ్లాలి అన్న సమాచారంతో మండల పరిషత్తు అధికారులు నోటీసులు సిద్ధం చేస్తున్నారు. నిర్ధేశించిన ఆసుపత్రులకు వెళ్లి రీ వెరిఫికేషన్ చేయించుకోని దివ్యాంగులకు నవంబరు నెల నుంచి పెన్షన్ రద్దు అవుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంత దూరం ఎల్లా వెళ్లాలన్న ఆందోళన దివ్యాంగుల్లో మొదలైంది.

క్రిస్టియన్ సెల్ కార్యదర్శిగా జలసూత్రం



ఆగిరిపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తరపున ఆగిరిపల్లి మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా అమ్మవారిగూడెం గ్రామానికి చెందిన రెవ. జలసూత్రం జయరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్యదర్శి పదవికి ఎంపిక చేసిన మంత్రి కొలుసు పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు.

దాతల స్ఫూర్తి అభినందనీయం

ఆగిరిపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారం అభినందనీయమని హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ అన్నారు. తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో సంఘ సేవకులు కాకర్ల శంకరరావు, నాగళ్ళ కృష్ణమోహన్, డాక్టర్ అడుసుమిల్లి ప్రతాప్ కుమార్ ఆర్థిక సాయంతో ప్రకాశం జిల్లాకు చెందిన కొల్లూరి చెన్న కేశవ, గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన కొక్కిలిగడ్డ సాయిబాబు, కృష్ణా జిల్లా కేసరపల్లికి చెందిన మంగళగిరి అర్జునరావుకు కృత్రిమ కాళ్ళను అమర్చారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, డాక్టర్ జి. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి కృతజ్ఞతలు

ముసునూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడి నుంచి కొత్తగూడెం వెళ్ళే అంతర్గత రహదారి అభివృద్ధి చెందనుంది. ఈ రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ. 2.30 కోట్ల నిధులు మంత్రి పార్థసారథి చొరవతో ఇటీవల మంజూరు అయ్యాయి. ఆదివారం లోపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు చలమాల వెంకటేశ్వరరావు, పీఏసీయస్ డైరెక్టర్ వేంపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ డోలా రాంబాబు, మాజీ ఎంపీటీసీ పంజుగల వెంటేశ్వరరావు, చలమాల గంగాధర్ తదితరులు మంత్రి పార్థసారథిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

ముదినేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి యున్న శ్రీ వల్లీదేవసేనసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు నాగమల్లి చెట్టు వద్ద నాగ ప్రతిష్ఠలకు పూజలు జరిపి పుట్టలో పాలు పోసి పాలు పొంగళ్లు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

ముగిసిన గంగానమ్మ ఉత్సవాలు

కలిదిండి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పేట కలిదిండలో మూడ్రోజులుగా జరుగుతున్న గంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. అమ్మవారికి బోనాలు, వేడి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాయకుల చిత్రాలకు తారుపూసిన ఆగంతుకులు

- కూటమి శ్రేణుల ఆగ్రహం..
- చర్యలు తీసుకోవాలని డిమాండ్
- చిత్రాలకు క్షీరాభిషేకం చేసిన నాయకులు


శిలాఫలకంపై ఫోటోలకు క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

మండవల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవపట్నంలో శిలాఫలకంపై నాయకుల చిత్రాలకు దుండగులు పూసిన తారును ఆదివారం కూటమి నాయకులు తొలగించి క్షీరాభిషేకం చేశారు. గ్రామంలో కొత్తగా ఏర్పడిన కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఈ ఏడాది జనవరి 23న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఆ శిలాఫలకంపై ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చిత్రాలపై గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తారు పూశారు. దీనిపై కూటమి నాయకులు తీవ్ర నిరసన తెలిపారు. దోషులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
మంత్రి పార్థసారథి

ముసునూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం చింతలవల్లిలో ఆయన పర్యటించారు. గ్రామ సచివాలయం వద్ద ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన పెన్షన్లు, ఇళ్ళ స్థలాలు, నూతన పట్టాదారు పాసు పుస్తకాలు, గతంలో నిర్మించిన ఇళ్ళకు బిల్లులు, రెవెన్యూ, విద్యుత్ తదితర సమస్యలపై బాధితులు మంత్రికి అర్జీలు అందజేశారు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అప్పటి కప్పుడే కొన్ని సమస్యలను పరిష్కరించారు. ప్రజల కు సుపరిపాలనను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. అనంతరం ఓ అన్నప్రా సన వేడుకలో మంత్రి పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్రబాబు, నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, పాలడుగు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


పసలపూడిలో శంకుస్థాపన చేస్తున్న కామినేని

పెద్దయెత్తున రోడ్ల నిర్మాణం
ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

మండవల్లి, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి నుంచి గున్ననపూడి వరకు రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న 4.2 కిలోమీటర్ల రోడ్డుకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో పెద్దయెత్తున రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ముంపునకు ముందుండే శివారు ఎస్సీ గ్రామాల్లో రూ. 3 కోట్లతో రోడ్లు నిర్మించడం ఆనందంగా ఉందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా సురేష్‌బాబు, గన్నమనేని సుధాకర్, కిరణ్‌రాజు, బొర్రా చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునః ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే

మండవల్లి మండలం లింగాల గ్రామంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవాలయం పునః నిర్మాణం పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, పలువురు ఎన్డీఏ నాయకులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లైన్ క్లియర్
(5వ పేజీ తరువాయి)

పిచ్చిమొక్కలు తొలగించి కుడి కాల్వ రిటైనింగ్ పనులు చేప ట్టారు. పనులు వేగవంతం చేసి వర్షాకాలంలోపు పూర్తి చేయాలని నిర్ణయించినా నిధుల లేమితో అవలేదు.

రానున్న సీజనే కీలకం..

తమ్మిలేరు వరదలు వర్షాల తర్వాత ఎండిపోనుంది. వాస్తవంగా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు తమ్మిలేరులో డెడ్‌స్టోరేజీకి వాటర్ నిల్వలు పడిపోతాయి. అప్పుడు పనులు పూర్తి చేయడానికి అనుకూలంగా ఉంటుంది. మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు వేగంగా ప్రారంభం అయ్యాయి. కాంట్రాక్టర్‌కు రూ.6కోట్ల మేర ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లింపు జరగలేదు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు


శరవణ శర్మ

ముదినేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం గ్రామానికి చెందిన కోట శరవణ శర్మ(14) అదృశ్యమయ్యాడు. సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వేదపండితుడు కోట శివశంకర శర్మ కుమారుడు శరవణ శర్మ ఇటీవల విజయవాడలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ నెల 8న సింగరాయపాలెం తిరిగి వచ్చేందుకు విజయవాడలో ఆ బాలుడి పెదనాన్న భీమవరం బస్సు ఎక్కించి వెళ్లిపోయాడు. అయితే బాలుడు సింగరాయపాలెం రాలేదు. తల్లిదండ్రులు, విజయవాడలోని బంధువులు ఏం జరిగిందన్నది ఆరా తీయగా, బస్ స్టేషన్‌లో సీసీ కెమెరా ఫుటేజీలో ఆ బాలుడు భీమవరం బస్సు దిగి టీజీఆర్టీసీ హైదరాబాద్ బస్సు ఎక్కినట్లు కనిపించింది. ఆ బస్సులో ఎక్కడికి వెళ్లాడన్నది తెలియలేదు. బాలుడి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు విజయవాడ కృష్ణలంక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తన తండ్రి శివశంకర శర్మ వద్ద శరవణ శర్మ వేద విద్య నేర్చుకుంటున్నాడు.

వివాహితతో అసభ్య ప్రవర్తన

ముదినేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మినంపాడు గ్రామానికి చెందిన కె. సింధు అనే వివాహిత ఈ నెల 11న సమీపంలోని మురుగు కాల్వ వద్ద మేకలను మేపుకుంటుండగా ములకలపల్లికి చెందిన విజయ్‌బాబు, కార్తీక్ ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆమె భర్త నాగయ్య, మామగారు అదేమని ప్రశ్నించగా వారిపై నిందితులు దాడి చేశారు. దీనిపై ఆదివారం అందిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వీ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదపాలపర్రులో కొడాలి రమేష్ అనే వ్యక్తి తన స్థలాన్ని మట్టితో పూడ్పించడంతో సరిహద్దున ఉన్న కొడాలి శోభనాద్రి ఇంటి స్థలానికి రమేష్ స్థలానికి మధ్య ఉన్న సరిహద్దు రాళ్లు పూడిపోయాయి. దీనిపై ఇరువురి మధ్య తగాదా జరిగింది. రమేష్‌ను ఇనుప కడ్డీతో శోభనాద్రి తదితరులు దాడిచేయగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రమేష్ గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, శనివారం ఆసుపత్రి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.


రహదారిపైకి చేరిన నీరు.. (ఇన్‌సెట్) సాగర్ కాల్వ నుంచి వృథాగా పోతున్న నీరు

నీటి వృథా పట్టదా..?

ముసునూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ నీరు వృథాగా పోతున్నా ఎన్నెస్పీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ముసునూరు మండలం కొర్లకుంట పంచాయతీ పరిధిలో గుర్రాలమ్మ, గుర్రాలయ్య ఆలయం మీదుగా నూజివీడు వెళ్ళే రహదారిలో వేంపాడు మేజర్ కాలువ గోడకు రంధ్రంపడి నీరు వృథాగా పోయి, రహదారిలో ఏర్పడిన గుంతల్లో చిన్నపాటి చెరువును తలపించేలా నీరు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల కిందట నాగార్జునసాగర్ నుంచి ఈ కాలువకు నీటిని విడుదల చేశారు. పంట పొలాల్లోకి వెళ్ళాల్సిన నీరు వృథాగా పోవడంతో పాటు పక్కన ఉన్న చిన్న చిన్న కుంటలు సైతం నిండి, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పార్థసారథి కృషితో సకాలంలో సాగర్ జలాలు వచ్చాయని, నీటిని వృథా కాకుండా చూడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉండటంతోనే నెలల తరబడి సాగునీరు వృథాగా పోతోందని రైతులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రంధ్రం పూడ్చి, సాగర్‌నీరు వృథా కాకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఎన్నెస్పీ ఏఈ వీరబ్రహ్మంను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.